క్లుప్తంగా

ఘనంగా బోనాలు



బోనాలతో విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు పోతురాజు, అమ్మవారి వేషధారణతో బోనాలతో సందడి చేశారు. చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినా.. సంస్కృతి సంప్రదాయాలను మరువొద్దన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం రాజకీయ చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. నేతకాని మహర్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాజకీయ చైతన్యయాత్రను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్, వెంకటేష్, రాజగంగన్న, శ్యాం, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ముధోల్: నియోజకవర్గంలోని కుంటాల, కుభీర్, లోకేశ్వరం, తానూరు మండలాల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ నాయకులు సందీప్, పోతారెడ్డి తెలిపారు. మంగళవారం ముధోల్‌లో పార్టీ కార్యాలయంలో యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విజయ్‌కుమార్‌రెడ్డిపై అభిమానంతో తాము కాంగ్రెస్‌లో చేరినట్లు వారు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

భైంసారూరల్: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో మండలంలోని గుండేగాం వాగు వద్ద ఎస్సై పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో పల్సికర్‌రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

4న కార్మిక గర్జన

మామడ: కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. మండలంలోని పొన్కల్‌లో కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతోపాటు పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, మనోహర్, నీల, సరోజ, పుష్ప, శ్రీనివాస్, గోదావరి, పద్మ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలి

లక్ష్మణచాంద: బదిలీలు వెంటనే చేపట్టి.. అర్హులకు పదోన్నతి కల్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితారెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. యూఎస్‌పీఎస్సీ పిలుపు మేరకు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని కోరారు. చంద్రనాగకాంత్, గంగాధర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

'అక్రమ పట్టా రద్దు చేయాలి'

భైంసాటౌన్: మండలంలోని హంపోలి గ్రామంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన స్థలాన్ని కొందరు అక్రమ పట్టా చేసుకున్నారని.. వెంటనే రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో మంగళవారం నిరసన చేపట్టారు. సర్వేనం.16/ఆ లోని భూమిని ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తే.. కొందరు ధరణిని ఆసరాగా చేసుకుని అక్రమపట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఏఐకేఎంఎస్ నాయకులు విఠల్, అనిల్, ఎల్లన్న ఉన్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి

ఖానాపూర్: పంచాయతీ పంపిణీ చేసిన విత్తనాలను సద్వినియోగం చేసుకుని ఇంటింటా కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో మల్లేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ లో పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంతకుముందు కమ్యూనిటీ కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. సర్పంచ్ రామకృష్ణ, కార్యదర్శి లావణ్య, రవి, సుజాత తదితరులు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు ర్యాలీలు నిర్వహించండి

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో, పాఠశాలల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పోస్టర్ ఆవిష్కరించారు. నులిపురుగుల సంక్రమణతో పిల్లలలో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని మంత్రి పేర్కొన్నారు.

సమస్యల్లో సర్కారు బడులు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ప్రైవేటుగా దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం, పెచ్చులూడుతున్న పైకప్పు, చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్న తరగతి గదులు, అసంపూర్తి వంటగదులు వంటి సమస్యలు దర్శనమిస్తున్నాయి. సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరినా స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

- శిథిలావస్థకు కన్కపూర్ పాఠశాల భవనం
- వర్షానికి ఉరుస్తున్న తరగతి గదులు
- పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలిన స్లాబ్‌
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



లోకేశ్వరం: కన్కపూర్ పాఠశాల భవనం ఉరుస్తుండటంతో తరగతి గదిలో చేరిన వర్షపు నీరు



పైకప్పు లేని వంట గది

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ ప్రాథమిక పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ 65 మంది విద్యార్థులుండగా (బాలికలు 38 మంది, బాలురు 27) ముగ్గురు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంలో ఐదు గదులు ఉండగా.. ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఓ గదిలో స్టాఫ్‌రూం, ఓ గది ఉరుస్తుంది. దీంతో రెండు గదుల్లో ఐదు తరగతులకు చెందిన 65 మందికి పాఠాలు బోధిస్తున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు..

పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో తరగతి గదులు సరిపోక ఉపాధ్యాయులు చెట్ల కింద పాఠాలు చెప్పేవారు. కానీ ప్రస్తుతం వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాలలోకి చొరబడి యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పాఠశాలలో వంటగదికి పైకప్పు లేకపోవడంతో నిర్వాహకులు సైతం వరండాలోనే భోజనం వండుతున్నారు.

ఉరుస్తున్న టాక్లీ ప్రాథమిక పాఠశాల



పాఠశాల భవనంలో గదులు ఉరుస్తుండటంతో వరండాలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

భైంసారూరల్: మండలంలో మిర్జాపూర్ మీదుగా కుంభి వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుపై ఉన్న టాక్లీ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలలో 25 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరంతా తరగతి గదుల్లో చేరుతుంది. ఉన్న రెండు గదుల్లో పైకప్పుల పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు, పందులు, కుక్కలు పాఠశాలలోకి వచ్చి పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. భవనానికి మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

వర్షం పడితే ఇబ్బందులే



తరగతి గదులు సరిపోక బయట కూర్చొని చదువుకుంటున్నాం. వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నాం. ఒకే గదిలో రెండు, మూడు తరగతుల వారు కూర్చోవడంతో పాఠాలు అర్థం కావడం లేదు.
– మాధవి, నాలుగో తరగతి, కన్కపూర్

వసతులు కల్పించాలి



పాఠశాలల్లో కనీస సౌకర్యాల్లేక ఇబ్బంది పడుతున్నాం. రెండు గదుల్లోనే ఐదు తరగతుల వారికి పాఠాలు బోధిస్తున్నారు. ప్రహరీ లేక ఆవరణలోకి పశువులు వచ్చి పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.
– ఆకృతి, ఐదో తరగతి, కన్కపూర్

అధికారులకు విన్నవించాం..

పాఠశాలల్లో ఉన్న రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో నీరంతా తరగతి గదిలోకి చేరుతుంది. స్లాబు తడిసి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. ఈ బడి దుస్థితిని అధికారులకు విన్నవించాం.
– గణేశ్, ప్రధానోపాధ్యాయుడు, టాక్లీ

వసతులు కల్పిస్తాం

సమస్యలున్న పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఇబ్బంది రాకుండా చూస్తాం. రెండో విడత మనఊరు–మనబడిలో కన్కపూర్ పాఠశాలలో అదనపు తరగతి గదులు, సౌకర్యాలు కల్పిస్తాం. – చంద్రకాంత్, లోకేశ్వరం ఎంఈవో

సంక్షిప్త వార్తలు

'అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కట్లు'

ఖానాపూర్: ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం, స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్పందించకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఖానాపూర్: పెంబి మండలంలో పసుపుల బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ప్రస్తుతం బ్రిడ్జి పరిధిలోని గ్రామాల ప్రజలకు విద్య, వైద్యం అందని స్థితి నెలకొందని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానావత్ సిద్ధార్థనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రిడ్జి కొట్టుకుపోయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజనులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

21న క్విజ్ పోటీలు

పెంబి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 21న మధ్యాహ్నం ఇందిరమ్మ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మంగళవారం పెంబి పాఠశాలలో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, శంకర్, అజయ్, రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు, రేపు స్పాట్ అడ్మిషన్లు

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో (08)హెచ్ఈసీలో (15) సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. 19,20 తేదీల్లో పదో తరగతి ధ్రువపత్రాలతో కళాశాలకు రావాలన్నారు.

ప్రభుత్వం పరిష్కరించాలి

కడెం: పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, కాంగ్రెస్ నియోజవర్గ నాయకులు పెందూర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. సతీశ్ రెడ్డి, రహీం, రాజన్న, శేషు తదితరులు ఉన్నారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధులు దూరం



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారులు



నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ సరోజ

ఖానాపూర్: ముందస్తు జాగ్రత్తలతో ఫైలేరియా, కుష్టు వ్యాధులను రాకుండా చూసుకోవచ్చని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, ఆర్బీఎస్కే వైద్యుడు సన్నిత్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఫైలేరియా, కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కాళ్లను శుభ్రం చేసుకునే విధానం, కట్టు కట్టే పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం సుమారు 60 మంది ఫైలేరియా బాధితులకు టబ్, టవల్, క్రీం, బ్యాండేజీ, సబ్బుతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. వైద్యులు శివ, చందన, డీపీఎంవో రాజేశ్వర్, లెప్రసీ, ఫైలేరియా ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, ఎస్‌యూవో రాజు, హెల్త్ సూపర్‌వైజర్ సోము తదితరులు ఉన్నారు.

సారంగపూర్: గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సరోజ సిబ్బందికి సూచించారు. మండలంలోని బీరవెల్లి, వంజర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించి పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని పారబోయించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం పంచాయతీ భవన నిర్మాణం, ఇంకుడుగుంతల నిర్మాణం పరిశీలించారు. సర్పంచులు రవీంద్రనాథ్, లక్ష్మణ్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శులు మోయినుద్దీన్, విజయలక్ష్మి, ఏఎన్ఎం వినీత తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని వీధుల్లో ఎంపీడీవో శేఖర్, వైద్యసిబ్బందితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో నసీరుద్దీన్, ఏఎన్ఎం వనజ, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, బిల్‌కలెక్టర్ వంశీ, పంచాయతీ సిబ్బంది అక్బర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన

నర్సాపూర్(జి): వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త మైత్రి ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మండల సమాఖ్య పరిధిలో వీవోఏలకు వాష్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంజీ ముత్యం మాట్లాడుతూ శుభ్రమైన నీరు, సక్రమమైన మరుగుదొడ్ల వాడకం, హ్యాండ్ వాష్ అలవాట్లతో రోగాలు దరి చేరవని అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఎం సునంద మాట్లాడుతూ సభ్యులు వాష్ రుణాలు తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సీసీలు ఎస్.ముత్యం, సందేశ్, ముత్యం, వీవోఏలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇల్లు ముట్టడించిన కార్మికులు



ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంటిని ముట్టడించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. వర్షంలో తడుస్తూ ఎమ్మెల్యే ఇంటి ముందు అరగంటకుపైగా బైఠాయించారు. కనీస వేతనం చెల్లించడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నారాపాక నర్సయ్య, చంద్రశేఖర్, నాగరాజు, స్వామి, పోశెట్టి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మినవారిపై చర్య తీసుకోవాలి



వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

నిర్మల్‌చైన్‌గేట్: నకిలీ విత్తనాలు అమ్మినవారితో పాటు సరఫరా చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కుంటాల మండల రైతులు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్‌కు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ ఖరీఫ్ సాగు కోసం సోయా కేడీఎస్ 726 యశోద రకం కొని పంట వేస్తే మొలకెత్తలేదని తెలిపారు. 20 రోజులుగా దుకాణదారుడి వద్దకు వెళ్లి అడుగుతున్నా కంపెనీ స్పందించడం లేదన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో తోట రాఘవేందర్, అయిటి నందు, అర్గపు శ్రీకాంత్, గోపు రాజన్న, దత్తు, జక్కుల దత్తురాం పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సారంగపూర్: సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలనే సంకల్పంతో చేపట్టిన పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 24న నిర్మల్‌లో ప్రవేశిస్తుందని..ఉద్యోగులు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జామ్ గురుకుల పాఠశాలలో ఉద్యోగులను కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు చుక్కా సాయికృష్ణ, ప్రిన్సిపాల్ మారుతీ, అధ్యాపకులు శంకర్ తదితరులు ఉన్నారు.

'అధిక ఫీజులు నియంత్రించాలి'

ఖానాపూర్: మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా.. నియంత్రించంలో అధికారులు విఫలమయ్యారని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల అశోక్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని ఆరోపించారు. అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు నవీన్, బహుజన ముక్తి పార్టీ జిల్లా కార్యదర్శి షమీ తదితరులున్నారు.

అర్హుల జాబితా విడుదల చేయండి

దస్తురాబాద్: బీసీ కులవృత్తుల వారికి అందించే రూ.లక్ష రుణ సాయం అందించేందుకు అర్హుల జాబితా విడుదల చేయాలని మండలంలోని రేవోజీపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ, కార్యదర్శి సర్వే లేకుండానే జాబితా సిద్ధం చేశారని ఆరోపించారు. సర్వే చేసి గ్రామసభ ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. రంజిత్, రాము, జలందర్, రాజన్న, రమేశ్ పాల్గొన్నారు.

ఎంజేపీలో మాక్‌పోలింగ్

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ, అభ్యర్థులను ఎన్నుకునే పద్ధతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏటీపీ సుచరిత, వార్డెన్ రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కుభీర్: మహారాష్ట్రలోని శివుని వద్ద గోఅక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో మండలంలోని సాంగ్వికి చెందిన శేఖర్‌పై పలువురు దాడి చేసి హతమార్చారు. కుభీర్ హిందువాహిని శాఖ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం శేఖర్ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.పది వేల ఆర్థికసాయం అందించారు. అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

'బీజేపీని వీడను'



మాట్లాడుతున్న రామారావుపటేల్

నిర్మల్/భైంసాటౌన్: తాను బీజేపీని వీడే ప్రసక్తే లేదని, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత రామారావుపటేల్ స్పష్టం చేశారు. భైంసాలో మంగళవారం సాయంత్రం మాట్లాడారు. రోజురోజుకూ ముధోల్ నియోజకవర్గంలో తనకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తనపై సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో కొంతమంది దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. తానంటే గిట్టని దుష్టశక్తులు ఎన్ని ప్రచారాలు చేసినా తన వెంట బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారని, తాను పార్టీని వీడే ప్రసక్తే లేదని రామారావుపటేల్ స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు, అనుచరులు, అభిమానులు తనపై జరుగుతున్న దుష్ప్రచారం ఖండించాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలి

- ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: ప్రజలంతా ఐక్యంగా ఉండి రాజకీయాలకు అతీతంగా తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిగ్వా గ్రామంలో దేవాదాయ శాఖ నిధులు రూ.12లక్షలతో నిర్మించే ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ దేవిదాస్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, పార్టీ మండలాధ్యక్షుడు అనిల్ తదితరులు ఉన్నారు.

సౌకర్యాల్లేక.. విద్యార్థినుల ఇంటిబాట

- తానూరు కస్తూరిబాలో మరుగుదొడ్లు కరువు
- ఇప్పటికే టీసీలు తీసుకెళ్లిన 10 మంది
- పట్టించుకోని అధికారులు

తానూరు: మండల కేంద్రంలోని కస్తూరిబాలో సౌకర్యాల్లేకపోవడంతో విద్యార్థినులు ఇంటిబాట పడుతున్నారు. కస్తూరిబాలో ప్రస్తుతం 250 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ విద్యాసంవత్సరం కొత్తగా ఆరో తరగతిలో 75 మంది ప్రవేశం పొందారు. కానీ మరుగుదొడ్లు, సరిపడా స్నానపుగదులు, తరగతి గదుల్లో బెంచీలు, వేడినీటి యంత్రాలు, కిటికీలు, తలుపుల్లేవ్. దీంతో ఈ ఏడాది అడ్మిషన్ పొందిన ఆరో తరగతి విద్యార్థులు 10 మంది టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అలేఖ్యను వివరణ కోరగా మరుగుదొడ్ల సమస్య కారణంగా పది మంది విద్యార్థినులు టీసీలు తీసుకొని వెళ్లిపోయిన మాట వాస్తవమేనని అన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్నబావు సాఠేకు ఘన నివాళి



తానూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

కుభీర్: మండల కేంద్రంలో మంగళవారం సాహితీ సామ్రాట్ డాక్టర్ అన్నబావు సాఠే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎస్.దిగంబర్ మాట్లాడారు. సాఠే సాహితీ లోకానికి, దళిత సమాజ ఉద్ధరణకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కల్యాణ్, సంతోశ్, అడెల్లు తదితరులు ఉన్నారు.

తానూరు: వెనుకబడిన కులాల అభివృద్ధికి కృషి చేసిన అన్నబావు సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్ అన్నారు. మంగళవారం మండలంలో తానూరు, భోసి గ్రామాల్లో సాఠే వర్ధంతి నిర్వహించారు. అనంతరం సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నబావు సాఠే సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

'సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే'



యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాథోడ్ రమేశ్

ఖానాపూర్: ధనార్జనే ధ్యేయంగా పని చేస్తూ.. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్కు వద్ద టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలో బీటీ రోడ్డు పనులు వర్షంలో చేశారంటే కాంట్రాక్టర్ల నుంచి ఎమ్మెల్యేకు కమీషన్లు అందుతున్నాయని అర్థం చేసుకోవచ్చన్నారు. పలు కాలనీల్లో సేవక్‌దళ్, చిరుత యూత్‌ల సభ్యులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పాతఎల్లాపూర్ పంచాయతీలోని ఒడ్డెవాడలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎల్లాపూర్, నడింపల్లె, గోసంపల్లె గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట్, బావాపూర్ గ్రామాలకు వెళ్లి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, దేశాయి రాము, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య, రవీందర్‌రెడ్డి, శివ, మల్లేశ్, రవి, జీవన్ తదితరులు ఉన్నారు.